


## గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిపై కేసు

వేమనపల్లి,జనవరి 27 : వేమనపల్లిలో గంజాయి మొక్కలు పెంచుతున్న తెల్ల నారాయణపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు అతడి ఇంటి ఆవరణలో తనిఖీ చేయగా, గంజాయి మొక్కలు లభించాయని పేర్కొన్నారు. నారాయణను విచారించగా తనకు గంజాయి అలవాటు ఉందని, గుర్తుతెలియని వ్యక్తి నుంచి విత్తనాలు తీసుకొని పెరట్లో నాటానని తెలిపాడు. రెండు మొక్కలు నాటగా ఒకటి ఆరబెట్టి దాచి పెట్టానని ఒప్పుకున్నాడు. ఇంకో చెట్టు పెరుగుతుందని తెలిపాడు. వ్యవసాయాధికారి వీరన్న పరిశీలించి, గంజాయి మొక్క అని నిర్ధారించడంతో నారాయణపై కేసు నమోదు చేసి, అదపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆర్ఐ అబ్దుల్లా ఖాలిక్, పోలీసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## తుపాకీతో బెదిరించిన వ్యక్తికి జైలు

మంచిర్యాల అర్బన్, జనవరి 27 : రివాల్వర్ చూపించి చంపుతానని బెదిరించిన మధ్యప్రదేశకు చెందిన గ్యాప్రసాద్ (రాజు)కు మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు, రూ.2 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిరోష తీర్పునిచ్చినట్లు సోమవారం పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ మహార్ పానీపూరీ బండి వ్యాపారం చేసుకునేవాడు. 2016, నవంబర్ 16న తన వద్ద కొంత కాలం పని చేసి మానేసిన మధ్యప్రదేశకు చెందిన గ్యాప్రసాద్ (రాజు)కు మధ్య గొడువ జరిగింది. రాజు తన వద్ద ఉన్న తుపాకీతో వినోద్ మహార్‌ను చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ సుధాకర్ కేసు నమోదు చేసి, రాజును అరెస్ట్ చేసి, తన వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సాక్షాధారాలను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ రవీందర్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో రాజుకు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

## దుప్పిని హతమార్చిన నిందితులు కోర్టులో హాజరు

చెన్నూర్ రూరల్, జనవరి 27 : చుక్కల దుప్పిని హతమార్చిన కేసులో చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన బోయ ప్రసాద్, నక్క మహేందర్‌ను సోమవారం కోర్టులో హాజరుపర్చినట్లు డీఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 24న అటవీ ప్రాంతంలో కరెంటు తీగలు అమర్చి చుక్కల దుప్పిని హతమర్చారు. అనంతరం నక్క మహేందర్ ఇంట్లో మాసం పంచుకున్నారు. పక్కా సమాచారం మేరకు డీఆర్డీవో ప్రభాకర్ సిబ్బందితో ప్రసాద్, మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఊరటి పోశం పరారీలో ఉన్నాడని తెలిపారు. ఎఫ్ఆర్వో శివకుమార్, బీట్ ఆఫీసర్ స్వప్న, సెక్షన్ ఆఫీసర్ రాజేశ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూర్ రూరల్, జనవరి 27 : చెన్నూర్ మండలం కిష్టంపేట సమీపంలోని ఆదిశంకరాచార్య పత్తి మిల్లులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మిల్లులోని పత్తి నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. భారీస్థాయిలో మంటలు చెలరేగడంతో చెన్నూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ విషయంపై మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులును వివరణ కోరగా.. పత్తి మిల్లులో పెత్త ఎత్తున ప్రమాదం జరిగిందని, కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు. జరిగిన నష్టం విలువ ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జన్నారం, జనవరి 27 : జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం గోల్కొండ పోచమల్లుకు చెందిన రేకుల ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్గమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, మంటలను ఆర్పివేశారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఆర్ఐ భానుచందర్, కార్యదర్శి లావణ్య పంచనామా నిర్వహించారు. తన పిల్లల చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, వస్తువులు, రెండు తులాల బంగారం, లక్ష నగదు, నాలుగు క్వింటాళ్ల బియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని, బాధితుడు వాపోయాడు. కాగా, బాధితులను తహసీల్దార్ పరామర్శించి, ప్రభుత్వం నుంచి రావాల్సిన తక్షణ సాయాన్ని అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.



నస్పూర్ : అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



ఆసిఫాబాద్ టౌన్ : వినతులు తీసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# సమన్వయంతో సమస్యలు పరిష్కరిస్తాం

నస్పూర్, జనవరి 27 : వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జన్నారం, మంచిర్యాల, జైపూర్, ఇందారం, వేమనపల్లి, తాండూర్, రేండ్లగూడ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన డైరీని డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్‌లో..**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండలాలకు పంపించి, క్షేత్రస్థాయిలో పరిలించి, అర్హులకు పథకాలు అందేలా కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

**కార్యదర్శిని బదిలీ చేయాలి..**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 27 : వాంకిడి మండలం తేజపూర్ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని కోరుతూ ప్రజలు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలున్నా, విధులను సక్రమంగా నిర్వహించకపోవడం, సమయ పాలన పాటించడం లేదని పేర్కొన్నారు.

**మిషన్ భగీరథ నీరు అందించాలి..**

కాసిపేట, జనవరి 27 : మంచిర్యాల జిల్లాకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడ ప్రాజెక్ట్ నుంచి మిషన్ భగీరథ నీరు కొద్ది రోజులుగా రావడం లేదని, మంచిర్యాల గోదావరి నుంచి అందించాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్కపురం రమేశ్ కోరారు. ఈ మేరకు కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో షేక్ సప్దర్ అలీకి వినతిపత్రం అందించారు.

# మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్
- ఆటో, పాఠశాలల వ్యాన్ల డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన

మందమర్రి, జనవరి 27: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో సోమవారం ఆటో, పాఠశాలల వ్యాన్ల డ్రైవర్లు, వాహనదారులు, ప్రజలకు మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌తో కలసి ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదని, ప్రమాదాలు జరుగుతన్నాయని



మందమర్రి : మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

పలువురు డ్రైవర్లు ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. మున్సిపాలిటీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో ఫ్లెక్సీలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐకి సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ మజీద్, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి, జనవరి 27 : దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ట్రాఫిక్ నిబంధనలు-రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు ఉన్నారు.

రామకృష్ణాపూర్, జనవరి 27 : క్యాతనపల్లి మున్సిపాలిటీ బీ జోన్ రాజీవ్‌చౌక్, సూపర్ బజార్ ఏరియాల్లోని ప్రజలు, వాహనదారులకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు అవగాహన కల్పించారు. కళాకారుల టీం లీడర్ ముల్కల మురళి, సభ్యులు కొప్పర్తి రవీందర్, వెల్తురు పోశం, వరకపురం రవికుమార్, బీరుపూరి శ్రీనివాస్, కాసిపేట సంతోష్, వావిలాల నాగలక్ష్మి, చేటుంట నిరోష, ప్రజలు పాల్గొన్నారు.

తాండూర్, జనవరి 27 : తాండూర్ ఐబీలో ప్రజలు, వాహనదారులకు సబ్ ఇన్‌స్పెక్టర్ డీ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా సహకరించాలని కోరారు.

# జెండా ఎగురవేయలేదని ఫిర్యాదు

కాగజ్‌నగర్, జనవరి 27 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణం కాపువాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జెండా ఎగురవేయలేదని సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు పట్టణనాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. జాతీయ జెండాను ఎగురవేయాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కొద్ది నెలలుగా జెండాను దింపకుండా కట్టి ఉంచడం, జాతీయ జెండాను అవమానపర్చడంపై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. వనమాల రాము, పుల్ల శ్రీకాంత్, మహెబుబ్ ఖాన్, బుర్స వెంకటేశ్, గొడిసెల ఎల్లేశ్, బంక శివ ఫిర్యాదు చేశారు.



కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

## రగ్బీ ఎంపిక పోటీలు



జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికలు

సీసీసీ నస్పూర్, జనవరి 27 : మంచిర్యాల జిల్లాస్థాయి అండర్-15 బాలబాలికల రగ్బీ ఎంపిక పోటీలను నస్పూర్‌లోని కేజీఏ డిఫెన్స్ అకాడమీ మైదానంలో నిర్వహించారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పోటలను ప్రారంభించారు. జిల్లాలో రగ్బీ క్రీడకు ఆదరణ పెరుగుతున్నదని, అన్ని మండలాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేశ్, కేజీఏ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కుమార్, కోచ్ రమేశ్, పీఈటీలు దేవేందర్, వెంకటేశ్, సురేశ్, ధరణ్, నరిసింహులు, కుమార్ పాల్గొన్నారు.

**ఎంపికైన బాలబాలికల జట్లు..**

బాలుర విభాగంలో సూర్యతేజ, చరణ్‌తేజ, సాయి హన్సిక్, అశ్విత్‌రెడ్డి, అభిరామ్, దీక్షిత్, సాత్విక్, హర్చిత్, ఎస్కే రెహాన్, సాయిప్రజ్ఞవ్, ఎండీ రెహాన్, రిక్కింగ్‌రాజ్ ఉన్నారు. వీరికి స్టాండ్ బై గా వెంకటరమణ, భీమేశ్, వెంకట్‌సాయి, ఫర్దిన్‌ఖాన్, సాయివర్షిత్, అశ్విత్, సాయివినేశ్, నందకిషోర్, సాయిమనోహర్ ఎంపికయ్యారు. అలాగే బాలికల విభాగంలో యోగితాశ్రీ, అశ్విత, సిమ్రిత, అభినవ, సనా, వైష్ణవి, సాక్షి, తేజస్విని, సాయివర్షిత, స్పందన, అశ్విత, ఎస్కే సుహానా ఎన్నారు. స్టాండ్ బై గా హర్షిత, సాత్వీక, హిమప్రియ, చాందిని, హిమని, సాన్వీశ్రీ, శివంజలి ఎంపికయ్యారు.

## సీసీఐ వల్ల కాంగ్రెస్‌కు చెడ్డపేరు

**సీనియర్ నాయకుడు రాంరెడ్డి**



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి

చెన్నూర్, జనవరి 27 : పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అవలంబిస్తున్న విధానాల వల్ల కాంగ్రెస్‌కు చెడ్డ పేరు వస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పోటు రాంరెడ్డి అన్నారు. సోమవారం చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీసీఐ రైతుల నుంచి ఎప్పుడు పత్తి కొనుగోళ్లు చేపడుతున్నదో.. ఎప్పుడు నిలిపివేస్తున్నదో తెలియడం లేదన్నారు. సీసీఐకి అమ్ముకున్న పత్తి రైతులకు ఏ బ్యాంకులో డబ్బులు పడుతున్నాయో తెలియక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సీసీఐ పత్తి నాణ్యతను పరిశీలించకుండానే.. పత్తిలో నాణ్యత లేదంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మద్దతు ధర చెల్లించకుండా రూ. 100 నుంచి రూ. 200 దాకా కోతలు పెడుతున్నారని ఆరోపించారు. చెన్నూర్ ప్రాంత పత్తి రైతులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నా మార్కెట్ కమిటీ అధికారులు పట్టించు కోవడం లేదని ఆరోపించారు. నాయకులు బాపు, సంజీవరెడ్డి, పోచం, రాజశేఖర్ పాల్గొన్నారు.

## కోటపల్లి తహసీల్దార్ బదిలీ

కోటపల్లి, జనవరి 27 : కోటపల్లి తహసీల్దార్ మహేంద్రనాథ్ మంచిర్యాల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్ర రావ్ కోటపల్లికి రానున్నారు.